

మారిన విధానంతో.. మిల్లర్ల బెంబేలు

- గతంలో పౌరసరఫరాల సంస్థకే సీఎంఆర్ అప్పగింత
- ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకూ అప్పగించాలనే నిబంధన ఉన్నా మిల్లర్ల నిర్లక్ష్యం
- కేటాయించిన ధాన్యం అమ్ముకొని, రీసైక్లింగ్ బియ్యం సీఎంఆర్‌గా అందజేత
- క్వాలిటీ కంట్రోల్ విషయంలో పౌరసరఫరాల సంస్థ అధికారుల ఉదాసీనత
- తాజాగా ఎఫ్‌సీఐకి మాత్రమే బియ్యం అప్పగించాలని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం
- నాణ్యతను పకడ్బందీగా తనిఖీ చేయనున్న ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
- మర ఆడించేందుకు మిల్లుల్లో లేని ధాన్యం
- సీఎంఆర్ అందజేయడంలో మిల్లర్ల తర్జనభర్జన



వనపర్తి జిల్లాలోని ఓ రైస్ మిల్లులో ధాన్యం నిల్వలను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు (ఫైల్)

మహబూబ్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రేషన్ బియ్యం సరఫరా కోసం ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా ఏటా ధాన్యం సేకరించి.. సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) కింద రైస్ మిల్లర్లకు కేటాయిస్తున్న విషయం తెలిసిందే. మిల్లర్లు నిర్దేశిత సమయంలోపు ధాన్యాన్ని బియ్యంగా మార్చి, పౌరసరఫరాల సంస్థతోపాటు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు అప్పగించాల్సి ఉంటుంది. కానీ ఏళ్లుగా సమయానికి అనుగుణంగా మిల్లర్లు సీఎంఆర్‌ను అప్పగించడం లేదు. గత ప్రభుత్వం కూడా మిల్లర్ల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడంతో పాటు గడువు పెంచుకుంటూ పోయింది. గత సంవత్సరం చాలావరకు పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ను కచ్చితంగా అప్పగించాలని ప్రస్తుత ప్రభుత్వం హుకూం జారీ చేయడంతో మిల్లర్లు బకాయిలను పూడ్చుకునేందుకు పెద్ద మొత్తంలో రీ సైక్లింగ్ బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థకు అప్పగించారు. అయితే ఇక్కడే అసలు మతలబు ఉంది. ఏటా కేటాయించిన ధాన్యంలో నిర్దిష్ట మొత్తం సీఎంఆర్ అటు పౌరసరఫరాల సంస్థతోపాటు ఇటు ఎఫ్‌సీఐకి కూడా అందజేయాల్సి ఉండగా.. పెండింగ్ సీఎంఆర్‌ను మిల్లర్లు ఎక్కువగా కేవలం రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే పౌరసరఫరాల సంస్థకే అప్పగించారు. క్వాలిటీ కంట్రోల్ విషయంలో పౌరసరఫరాల సంస్థ అధికారులు, టెక్నికల్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతోపాటు రైస్ మిల్లర్లకు సహకరించడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా పరిస్థితి తయారైంది. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ను ఈ పద్ధతిలోనే అప్పగించగా.. కొందరు అధికారులు కూడా ఒత్తిడి తగ్గించుకునేందుకు మిల్లర్లు చెప్పినదానికి తల ఊపారు. ఇది గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం నడుస్తున్న గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన బియ్యాన్ని కేవలం ఎఫ్‌సీఐకి మాత్రమే అప్పగించాలని చెప్పింది. దాంతో రైస్ మిల్లర్లు తర్జనభర్జన పడుతున్నారు. దీనికి కారణం పౌరసరఫరాల సంస్థ మాదిరిగా ఎఫ్‌సీఐ నిబంధనలు ఉండకపోవడం ఒకటైతే.. అక్కడ క్వాలిటీ కంట్రోల్‌ను పకడ్బందీగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఎఫ్‌సీఐకి రీసైక్లింగ్ బియ్యం ఇవ్వడం కష్టతరంగా మారుతుందని, కచ్చితంగా మిల్లింగ్ చేసిన ధాన్యాన్నే ఇవ్వాల్సి ఉంటుందని ఆందోళన చెందుతున్నారు.

గడువు ముగుస్తున్నా ఇవ్వని సీఎంఆర్

గతేడాది వానాకాలంలో ఉమ్మడి జిల్లాలోని 321 రైస్‌మిల్లులకు 3,81,024 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించారు. అందుకు సంబంధించి సీఎంఆర్ అప్పగించేందుకు జూన్ 30తో గడువు ముగిసింది. మొత్తం 2,55,376 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌కు గాను ఇప్పటి వరకు కేవలం 73,587 మెట్రిక్ టన్నులు మాత్రమే అప్పగించారు. అత్యధికంగా నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లోనే పెండింగ్ ఉంది.

- వనపర్తి జిల్లాలో 82 మిల్లులకు 1.91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా.. 1.28 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. కానీ, ఇప్పటి వరకు 23,461 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. ఇంకా 1.04 లక్షల సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది.
- నారాయణపేట జిల్లాలో 38 మిల్లులకు 48,536 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా.. 19,759 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాలి. అందుకుగాను 12,760 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు.
- మహబూబ్‌నగర్ జిల్లాలో 64 రైస్ మిల్లులకు 67,513 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా.. 45,274 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. అందులో 22,191 మెట్రిక్ టన్నులు ఇచ్చారు. ఇంకా 23,083 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉంది.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో 82 మిల్లులకుగాను 73,136 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా.. 49,048 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాలి. ఇప్పటి వరకు 7,946 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అప్పగించగా.. 41,102 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉంది.
- గద్వాల జిల్లాలో 55 మిల్లులకు 445 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా.. 301 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాలి. ఇప్పటివరకు 230 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వగా.. ఇంకా 71 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉన్నాయి.

వెలుగులోకి నిల్వల లేమి..

ప్రస్తుతం ఎఫ్‌సీఐకి మాత్రమే ధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కచ్చితమైన ఆదేశాలు ఇవ్వడంతో.. మిల్లుల్లో ఉన్న ధాన్యాన్ని మర ఆడించాల్సిన పరిస్థితి మిల్లర్లకు ఏర్పడింది. అయితే ఏళ్లుగా కేటాయించిన ధాన్యాన్ని ముందస్తుగానే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఆ తర్వాత మిల్లుల్లో మర ఆడించకుండానే రీసైక్లింగ్ బియ్యం ద్వారా సీఎంఆర్‌ను దశల వారీగా భర్తీ చేశారు. అయితే ఇప్పుడు విధానం మారడం.. మిల్లుల్లో కేటాయింపుల మేర ధాన్యం లేకపోవడంతో ఎఫ్‌సీఐకి బియ్యం ఇచ్చేదెలా అని ఆలోచనలు చేస్తున్నారు. ఇటీవల వనపర్తి జిల్లాలోని మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టగా, చాలా మిల్లుల్లో కేటాయింపుల మేర ధాన్యం నిల్వలు లేనట్లు అధికారులు గుర్తించారు. వనపర్తి మండలం అచ్యుతాపురంలోని మహాలక్ష్మి రైస్‌మిల్లులో ఇటీవల టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ద్రోణాచార్యుడు ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో 2.40 లక్షల ధాన్యం బస్తాలు లేవని తెలిపారు. సీఎంఆర్ కింద ఎఫ్‌సీఐకి కోటా ఇవ్వాలని ఒత్తిడి పెరుగుతుండటంతో ఇటీవల నలుగురు మిల్లర్లు.. తమ సీఎంఆర్‌ను నిర్మాణంలో ఉన్న మిల్లుకు బదిలీ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. అయితే అన్ని జిల్లాల్లోని మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యం వివరాలతో తనిఖీలు చేపడితే ఇంకా భారీ ఎత్తున అక్రమాలు బయటపడే అవకాశం ఉంది. కేవలం కొన్ని మిల్లుల్లోనే తనిఖీలు చేయడం వల్ల పూర్తి అక్రమాలు వెలుగులోకి రావడం లేదు. ఇప్పటికే 2020-21 యాసంగి, వానాకాలం సీజన్‌లకు సంబంధించి బియ్యం ఇవ్వని వనపర్తి జిల్లాలోని 25 మంది మిల్లర్లకు నోటీసులు జారీ చేశారు. వారికి గత యాసంగిలో కేటాయింపులు కూడా చేయలేదు. యాసంగిలో సాగు తక్కువగా కావడం, కర్ణాటక వ్యాపారులు ఎక్కువగా కొనుగోలు చేయడంతో కొంత ఇబ్బంది తప్పినా.. ధాన్యం దిగుబడులు పెరిగితే మాత్రం సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లులకు కూడా కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో సీఎంఆర్‌ను పూర్తి స్థాయిలో రాబట్టడం లేదా మిల్లుల్లో ధాన్యం తనిఖీలు నిర్వహించి.. కేటాయింపుల మేర లేకుంటే ఆర్ఆర్ యాక్టు ద్వారా ఆస్తుల జప్తు చేయడం వల్ల ఉపయోగం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



చెంచులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

సీఎం దృష్టికి సమస్యలు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- నల్లమలలో సుడిగాలి పర్యటన

అచ్చంపేట/మన్ననూర్, జూలై 2: నల్లమల బిడ్డనని గర్వంగా చెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి చెంచుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి అన్నారు. అచ్చంపేట నియోజకర్గంలోని అచ్చంపేట, అమ్రాబాద్, ఉప్పునుంతల మండలాల్లో సీతక్క మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాజీపూర్ చౌరస్తాలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్రాబాద్ మండలం మన్ననూర్ వనమాలిక వద్ద పోలీసుల నుంచి సీతక్కతో పాటు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గౌరవవందనం స్వీకరించారు. పెంటలు, పరిసర గ్రామాల్లో ఉండే చెంచు మహిళలు, ఆదివాసీ నాయకులు, ప్రజాప్రతినిధులతో వనమాలికలోని చెట్ల కింద మంత్రి ముఖాముఖి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మన్ననూరులో 2014లో ఐటీడీఏ ఏర్పాటు చేసినా, రెగ్యులర్ పీవో, అధికారులను నియమించలేదన్నారు. దాంతో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పక్కా ఇళ్ల నిర్మాణం, కాడెద్దుల పంపిణీ, రోడ్లు, తాగునీరు, డాక్టర్లు, అంబులెన్సులు వంటి సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. పోడు భూములను సాగు చేసుకోనివ్వకుండా అటవీ అధికారులు అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెంచుల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి నల్లమల ప్రాంత బిడ్డ అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి రెండు రోజుల్లో సమస్యలను తీసుకెళ్తానన్నారు. ఐటీడీఏకు రెగ్యులర్ పీవోను నియమిస్తామని చెప్పారు. ఆదివాసీలకు పాత భూములను సాగు చేసుకునే హక్కులు కల్పిస్తామని, కొత్తగా అడవిలో చెట్లు నరకడం మానేయాలని చెప్పారు. పోడు భూముల్లో చెంచులు హార్టికల్చర్ విధానంలో పండ్ల తోటల పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీల పోడు భూముల సమస్యను అటవీ శాఖ డీఎఫ్‌వోలతో సమీక్షించి, సున్నితంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గతంలో కొందరు ప్రజాప్రతినిధులు ఈ ప్రాంత గుప్తనిధులపైన కన్నేశారని దుయ్యాబట్టారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఆయన సతీమణి, జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ వైద్య వృత్తితో పాటు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్విరామంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ మన్ననూరులో చెంచు విద్యార్థుల కోసం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటు చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే హైదరాబాద్‌కు తరలించిందన్నారు. సీఓఈ కళాశాలను మళ్లీ మన్ననూరుకు తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అమ్రాబాద్ మండలంలోని తెలుగుపల్లి గ్రామంలో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి ప్రారంభించారు. రాష్ట్రంలో 30 లక్షల మంది విద్యార్థులకు మహిళా సంఘాల సభ్యులతో యూనిఫామ్‌లు కుట్టించామని చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్లు, షాపింగ్ మాల్స్ వద్ద మహిళా శక్తి క్యాంటిన్లు, మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, డీఎఫ్ఓ, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ రోహిత్ గోపిడి, తాజా మాజీ ఎంపీటీసీ దాసరి శ్రీనివాసులు, మాజీ సర్పంచి పెద్దిరాజు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

మహిళా శక్తి ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. అచ్చంపేట పట్టణంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన 514 మహిళా సంఘాలకు రూ.50.10 కోట్ల రుణాల చెక్కులను అందజేశారు. మహిళలు తయారు చేసే వస్తువులను విక్రయించేందుకు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక వద్ద మహిళ శక్తి వేదికలు ఏర్పాటు చేస్తామన్నారు.

అర్ధాకలితో పాఠశాలకు..



జిల్లా కేంద్రంలోని మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో అల్పాహారాన్ని వడ్డిస్తున్న అధికారులు(ఫైల్)

- ప్రభుత్వ బడుల్లో అమలుకాని అల్పాహారం పథకం
- గత ప్రభుత్వ హయాంలో ప్రారంభం
- మండలానికి ఒక పాఠశాలలో అమలు
- దూర ప్రాంత విద్యార్థుల ఇక్కట్లు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 2: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం పథకం అమలు కావడం లేదు. గత రాష్ట్రప్రభుత్వం అక్టోబరు 24న ఈ పథకాన్ని ప్రారంభించింది. మధ్యాహ్న భోజనంతో పాటు తమిళనాడు రాష్ట్రంలో అమలవుతున్న విధంగా రాష్ట్రంలోనూ విద్యార్థులకు ఉదయం వేళ టిఫిన్ అందజేయాలని ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. దూర ప్రాంతాల విద్యార్థులు వేళకు స్కూల్‌కు వచ్చే క్రమంలో తినకుండా వస్తున్నారని, వారి ఆకలి తీర్చేందుకు రోజూ ఒక టిఫిన్ ఇవ్వాలని నిర్ణయించారు.

కొన్ని పాఠశాలల్లోనే అమలు

గత ప్రభుత్వం మొదటి విడత కింద మండలానికి ఒక పాఠశాలను ఎంపిక చేసి టిఫిన్ అందజేశారు. ఆ తర్వత పథకాన్ని అన్ని పాఠశాలకు విస్తరింపజేస్తామని చెప్పినా.. విస్తరించ లేదు. రోజూ ఉదయం ఎనిమిది గంటల నుంచి 8:45 గంటల వరకు విద్యార్థులు పాఠశాలకు వచ్చి టిఫిన్ చేసేలా ఏర్పాట్లు చేశారు. ఇడ్లీ, వడ, పూరి, ఉగ్గాని, ఉప్మా అందజేయాలని మెనూ తయారు చేశారు. మొదట్లో మెనూ ప్రకారం టిఫిన్ అందజేశారు. పథకం అమలుకుగాను ఉమ్మడి జిల్లాకు రూ.52 కోట్లు అవసరమని విద్యాశాఖ అధికారులు నివేదిక అందించారు. ఐదు జిల్లాల్లో మొత్తం మూడు వేల ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, మూడు లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమై 20 రోజులు కావస్తున్నా.. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా అల్పాహారం పథకం అమలు కావడం లేదు. దాంతో దూర ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. మధ్యాహ్న భోజనంతోనే సరిపెట్టుకుంటున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

గత ఏడాది చివరి వరకు మండలానికి ఒక పాఠశాలలో అల్పాహారం అందించాం. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ఈ విషయన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పథకాన్ని అమలు చేస్తాం.

- ఎ.రవీందర్, డీఈవో, మహబూబ్‌నగర్



మండల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

ఆరు గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి

పెద్దకొత్తపల్లి, జూలై 2 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలకు కట్టుబడి ఉందని, దశల వారీగా వాటి అమలు ప్రక్రియను చేపడుతోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మంత్రి జూపల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు ఒక కోటి 75 లక్షల రూపాయలతో నిర్మించిన ఎమ్మార్వో కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మండల సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్ ఉన్న ధనిక రాష్ట్రాన్ని తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో రూ.ఎనిమిది లక్షల కోట్ల అప్పు చేసి పేద రాష్ట్రంగా మార్చారని ధ్వజమెత్తారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడే పెద్దకొత్తపల్లి మండలానికి రూర్బన్ మిషన్ పథకం కింద రూ.30 కోట్ల నిధులు మంజూరు చేయించానని, ఆ నిధులతోనే ఇప్పటికీ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలు, రైతులు పనుల కోసం కార్యాలయాలకు వస్తే వారిని గౌరవించి, ఎవరి దగ్గర ఏం ఆశించకుండా పనులు చేసి పెట్టాలన్నారు. సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ అమలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని ఆయన వివరించారు.

ఐదు తరగతులు.. ఆరుగురు విద్యార్థులు

- ఒక్కరే టీచర్
- ఏకోపాధ్యాయుడితో సమావేశాలు ఉన్నప్పుడు మూత పడుతున్న బడి



దేశాయిపల్లి పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు వీరే..

దామరగిద్ద, జూలై 2: నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం దేశాయిపల్లి గ్రామ పాఠశాలలో ఐదు తరగతులు ఉండగా, ఆరుగురు విద్యార్థులు మాత్రమే చదువుకుంటున్నారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు రాము ఇటీవల మక్తల్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో వనితా జ్యోతి వత్తుగుండ్ల నుంచి బదిలీపై వచ్చారు. ఒక్కరే ఉపాధ్యాయురాలు ఉండటంతో సమావేశాలు, ఉపాధ్యాయులు సెలవు పెట్టినప్పుడు స్కూల్ మూత పడుతోంది. పాఠశాలలో 2019లో 61 మంది విద్యార్థులు ఉండేవారు. గత ఏడాది 17 మంది చదువుకున్నారు. ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతుండగా, ఈ ఏడాది ఆరుగురే ఉన్నారు. ఒకటో తరగతిలో ఒకరు, రెండో తరగతిలో ఒకరు, మూడో తరగతిలో ముగ్గురు, నాల్గో తరగతిలో ఒకరు ఉన్నారు. పాఠశాలలో ఒక్కరే ఉపాధ్యాయురాలు ఉండటం, గ్రామానికి మద్దూరు నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉండటంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను అక్కడి ప్రైవేటు స్కూళ్లలో చదివించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోనందునే పాఠశాలకు ఈ పరిస్థితి వచ్చిందని గ్రామస్థులు అంటున్నారు. గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని కూడా మొక్కుబడిగా నిర్వహించినట్లు తెలుస్తోంది.

మరమ్మతులకు రూ.8 లక్షలు మంజూరు

అమ్మ ఆదర్శ పథకం కింద పాఠశాలకు రూ. ఎనిమిది లక్షల నిధులు మంజూరయ్యాయి. శిథిలావస్థకు చేరిన పాఠశాల పై కప్పును తొలగించి, కొత్తగా వేయాల్సి ఉంది. ప్రహరీకి మరమ్మతు చేపట్టాల్సి ఉంది.

ఒక్కరికే అవకాశం

పాఠశాలలో పది మంది విద్యార్థులు ఉంటేనే ఇద్దరు ఉపాధ్యాయులను ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. ప్రస్తుతం దేశాయిపల్లి పాఠశాలలో ఆరుగురే విద్యార్థులు ఉన్నందున ఒక్కరే ఉపాధ్యాయుడికి అవకాశం ఉంది.

- గోపాల్ నాయక్, ఇన్‌చార్జి ఎంఈవో

వ్యక్తిపై హత్యాయత్నం

- పాత కక్షలతో బీరు సీసాలతో దాడి చేసిన దుండగులు
- తలపై, కడుపులో గాయాలు

వంగూరు, జూలై 2: పాత కక్షలతో వ్యక్తిపై దుండగులు బీరు సీసాలతో దాడి చేసిన సంఘటన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని సర్వారెడ్డిపల్లికి చెందిన వర్ర శేఖర్, మరో ఇద్దరు బంధువులు బైక్‌పై డిండి నుంచి సర్వారెడ్డిపల్లికి వస్తున్నారు. తిప్పారెడ్డిపల్లి గేటు వద్ద తిరుమలగిరి తండాకు చెందిన రాజు, అతని అనుచరులు బైక్‌ను అడ్డగించారు. బైక్ ఆపగానే రాజు బీరు సీసాలతో శేఖర్ తలపై కొట్టి, కడుపులో పొడిచాడు. దాంతో రక్త గాయాలతో శేఖర్ కుప్పకూలాడు. అనంతరం దుండగులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. 108 అంబులెన్స్‌లో శేఖర్‌ను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గతంలో శేఖర్, రాజులకు గొడవ అయినందున ఆ కక్షతోనే రాజు శేఖర్‌పై దాడి చేశాడు. శేఖర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

బైక్ గుంతలో పడి యువకుడి మృతి

ఉప్పునుంతల, జూలై 2 : బైక్ బోల్తా పడి యువకుడు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్ర సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. అమ్రాబాద్ మండలం బీకే తిర్మలాపూర్ గ్రామానికి చెందిన జే.రవికుమార్(25) సోమవారం ఉదయం మేనమామ అంజనేయులు గ్రామమైన ఉప్పునుంతలకు వచ్చాడు. తిరిగి రాత్రి తొమ్మిది గంటల సమయంలో స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా కట్ల బండ మలుపు వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న గుంతలో పడిపోయింది. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి కావడంతో ఎవరూ గమనించలేదు. మంగళవారం ఉదయం పొలాలకు వెళ్తున్న రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య అనూష ఉన్నారు.

కొండ ఇండస్ట్రీస్ రైస్‌మిల్ సీజ్


- ప్రభుత్వం సీఎంఆర్ కోసం అప్పగించిన ధాన్యం పక్కదారి
- రూ.4.70 కోట్ల అవినీతి
- మిల్లు యజమాని కొండ కృష్ణయ్యపై కేసు నమోదు



రైస్ మిల్‌ను సీజ్ చేసిన అధికారులు

ఆత్మకూరు, జూలై 2 : రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసి కొండ ఇండస్ట్రీస్ రైస్‌మిల్‌కు అప్పజెప్పిన ధాన్యాన్ని పక్కదారి పట్టించాడని ఆరోపిస్తు సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ షేక్ ఇర్ఫాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్‌లు తెలి పారు. 2021, 22, 23 సంవత్సరాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి ప్రభుత్వం కొనుగోలు చేసిన 3,684 టన్నుల ధాన్యాన్ని కొండ ఇండస్ట్రీస్‌కు సరఫరా చేసింది. ఈ ఏడాది మార్చిలో 2,468 టన్నుల బియ్యాన్ని సివిల్ స ప్లయ్ వారికి బియ్యంగా మార్చి సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటివరకు అందించలేదు. సివిల్ సప్లయ్ అధికారులు గతనెల 27వ తేదీన తనిఖీ చేయగా ధాన్యం మిల్లులో కనిపించలేదు. ఇందుకు గాను సుమారు రూ.నా లుగు కోట్ల 74 లక్షలు అవినీతి జరిగినట్లుగా గుర్తించి మిల్లు యజమాని కొండ కృష్ణయ్యపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.





తప్పు చేసిందంతా

ఉపాధ్యాయ సంఘాల నాయకులే

- స్పౌజ్ పాయింట్ల తప్పుదారిలో వారే కీలకం
- తప్పుచేశారు.. సరిచేసుకోండంటే పట్టించుకోని సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 2 : ఉపాధ్యాయ బదిలీల్లో స్పౌజ్ పాయింట్లను తప్పుదారి పట్టించడంలో రెండు, మూడు ప్రధాన ఉపాధ్యాయ సంఘాల నాయకులు కీలకంగా వ్యవహరించినట్లు విద్యాశాఖ విచారణలో తేలింది. భార్యాభర్తలిద్దరూ ఉపాధ్యాయులుగా ఉంటూ లక్షల రూపాయలు ప్రభుత్వం నుంచి వేతనం పొందుతూ ప్రధానంగా ఉపాధ్యాయ సంఘాల్లో నేతలుగా చెలామణి అవుతున్న వారే స్పౌజ్ పాయింట్ల తప్పుదారి పట్టించి అర్హత లేకున్నా ఉన్నట్లు చూపించి స్పౌజ్ పాయింట్లు వినియోగించుకొని విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా బదిలీల కోసం ఆన్‌లైన్ ద్వారా ఆప్షన్ ఇచ్చారు. దీనిపై అనుమానం వచ్చిన విద్యాశాఖ అధికారులు మండల విద్యాశాఖ అధికారుల ద్వారా విచారణకు ఆదేశించారు. కొందరు ఎంఈవోలు సదరు ఉపాధ్యాయులను పిలిచినా రాలేదని విద్యాశాఖ వర్గాల నుంచి వచ్చిన సమాచారం ద్వారా తెలిసింది. దీంతో సదరు ఎంఈవో ఉన్నది ఉన్నట్లుగా డీఈవోకు నివేదిక ఇచ్చారు. నలుగురు ఉపాధ్యాయులు స్పౌజ్ పాయింట్లు ఉపయోగించి నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను ఎంచుకొని ఆన్‌లైన్ బదిలీల్లో ప్లేసులు పొందారు. దీనిపై కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మొత్తంగా జిల్లా ఉపాధ్యాయుల బదిలీలు సజావుగా సాగుతున్నాయని అధికారులు చెపుతున్నారు. జీహెచ్ఎంల బదిలీలు మొదలుకొని సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీ వరకు స్పౌజ్ పాయింట్ల తప్పిదాలు చేస్తున్నారు. దీంతో అధికారులు కూడా సీరియస్‌గానే ఉన్నారు. తప్పు చేసిన వారిపై ఏ విధమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఇక్కడి అధికారుల ద్వారా తెలిసింది. రాష్ట్ర అధికారుల నుంచి చర్యలకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు వస్తాయోనని ఉపాధ్యాయ సంఘాల్లో చర్చ జరుగుతోంది. జిల్లాలో ఎస్‌జీటీకి సంబంధించి నలుగురు ఉపాధ్యాయులవి రెండు ఇంక్రిమెంట్లు కట్ చేస్తారని విద్యాశాఖలో పనిచేసే ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. లేకపోతే సస్పెన్షన్ వేటు కూడా పడే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కొందరు సంఘాల నాయకులు తమ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని అధికార పార్టీ నాయకుల నుంచి జిల్లా అధికారులపై వత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

పీయూ అధ్యాపకుడికి డాక్టరేట్



పీయూ అధ్యాపకుడు సిద్ది రామయ్యగౌడ్‌కు డాక్టరేట్ పత్రాన్ని అందజేస్తున్న పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, జూలై 2 : పాలమూరు యూనివర్సిటీ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విభాగం అధ్యాపకుడు సిద్ది రామయ్యగౌడ్‌కు డాక్టరేట్ లభించింది. డాక్టరేట్‌కు సంబంధించిన పత్రిక ప్రకటనను, డాక్టరేట్ పత్రాలను పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్ మంగళవారం పరిపాలన భవనంలో అందజేశారు. తెలంగాణ యూనివర్సిటీలోని కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో పారిశ్రామిక రంగంలో అతి తక్కువ ఖర్చుగల మిశ్రమ లోహ ఆక్సైడ్‌ల వినియోగం అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈయన పరిశోధన పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జనరల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి సిద్ది రామయ్యగౌడ్‌ను అభినందించి మరిన్ని పరిశోధనలు చేసి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలి

- వైద్య సిబ్బందికి సూచనలు చేసిన మండల వైద్యాధికారి



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ రబ్

భూత్పూర్, జూలై 2 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంటుందని మండల వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ రబ్ సూచించారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాల్లోని సబ్ సెంటర్లల్లో పనిచేస్తున్న వైద్యులకు, సిబ్బందికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనాభా నియంత్రణలో పాటించాల్సిన పద్ధతులను గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. వర్షాకాలంలో ఆరోగ్య సమస్యలు, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన విషయాలను వైద్యాధికారి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఆయూబ్‌ఖాన్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

- గురుకుల పాఠశాల విద్యార్థులతో మాటామంతి



గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

హన్వాడ, జూలై 2 : హన్వాడ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ జానకి తనిఖీ చేశారు. నేరాల కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మండలంలో ఎక్కువగా నమోదైన కేసుల వివరాలను తెలుసుకున్నారు. పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం పల్లెమోని కాలనీ వద్ద ఉన్న గురుకుల పాఠశాల హాస్టల్‌ను పరిశీలించి, అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. తాను కూడా మీలాగే గురుకుల పాఠశాలలో చదువుకున్నానని ఎస్పీ తెలిపారు.

ఘనంగా బోనాల పండుగ



ఇబ్రహీంనగర్‌లో బోనాలను ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

కోయిలకొండ, జూలై 2 : మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని ఇబ్రహీంనగర్, జమాల్‌పూర్, లింగుపల్లి గ్రామాల్లో ప్రజలు మంగళవారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోనం కుండలను వివిధ పూలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో బోనాలకు డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అంజనేయులు పాల్గొన్నారు.





శిథిలావస్థలో పాఠశాల భవనం

- మూడు గదుల్లోనే ఏడు తరగతులకు విద్యా బోధన
- పెచ్చులూడుతున్న పైకప్పు
- 15 ఏళ్లకే కుప్పకూలిన కొత్త అదనపు గదుల భవనం
- కొత్త భవనం నిర్మించాలని కలెక్టర్‌కు విద్యార్థుల వినతి



ఉప్పరిపల్లి పాఠశాలలో తరగతి గదిలో పెచ్చులూడిన పైకప్పు

ఖిల్లాఘణపురం, జూలై 2 : విద్యార్థులకు విద్యనందించే విద్యాలయాలు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు , తల్లిదండ్రులు నూతన భవన నిర్మాణం కావాలంటూ పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోకపోవడంతో సోమవారం 20 మంది విద్యార్థులు నేరుగా ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి పాఠశాల భవన స్థితిని తెలిపి నూతన భవనాన్ని నిర్మించాలని వేడుకున్నారు. మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుంది. వర్షాకాలంలో పాఠశాలలోని తర గతి గదుల్లో తరచుగా పైకప్పు పెచ్చులు ఉండడం గదుల్లోకి వర్షపు వరద నీరు రావడం సర్వసాధారణంగా మారిందని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 109 మంది విద్యార్థులు, 7 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. భవనంలో 1 నుంచి 7 తరగతుల విద్యార్థులకు విద్యా బోధన శిథిలావస్థకు చేరిన 3 గదుల్లో నిర్వహిస్తున్నారు. పాఠశాల నిర్వహణ సమయంలో వర్షం వస్తే భవనం కూలిపోతుందని భయంతో విద్యార్థులు వరండాలోకి వస్తున్నారు. వర్షాకాలంలో భయం భయంగా విద్యార్థులు పాఠశాలకు వచ్చి విద్యను అభ్యసిస్తున్నారు. తరగతి గదిలో విద్యార్థులను షిఫ్టుల ప్రకారం ఒక రోజు ఒక తరగతి విద్యార్థులు మరో రోజు మరో తరగతి విద్యార్థులు గదిలో కూర్చోబెట్టి ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలో 15 సంవత్సరాల క్రితం నిర్మించిన అదనపు గదులు నాణ్యత లోపించడంతో కుప్పలిపోయింది. పాఠశాల భవనం ముందు భాగంలో 10 సంవత్సరాల క్రితం నిర్మించిన మరో అదనపు రెండంతస్తుల రెండు గదుల భవనంలో 5 సంవత్సరాల క్రితం గదిలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడి తలపై భవనం పైకప్పు పెచ్చులూడి పడడంతో గాయాలయ్యాయి. పాఠశాల అదనపు గదుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుని కూలిపోతున్నాయని స్థానికులు వాపోయారు. ప్రభుత్వ నిధులతో నిర్మించే భవనాలు కనీసం 20 ఏళ్లు కూడా వినియోగంలోకి రాకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గిరిజన డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు

జడ్చర్ల, జూలై 2 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం గ్రామ సమీపంలోని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాలలో ఎస్టీ బాలురకు స్పాట్ అడ్మిషన్‌లకు అవకాశం కల్పించామని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మంజుల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో చేరాలనుకునే విద్యార్థులు నేరుగా కళాశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

డిగ్రీలో మాల్ ప్రాక్టీస్ అయిన విద్యార్థులు కమిటీ ముందు హాజరు కావాలి

పాలమూరు యూనివర్సిటీ, జూలై 2 : పాలమూరు యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న కళాశాలల్లో డిగ్రీలో మాల్ ప్రాక్టీస్ అయిన విద్యార్థులు బుధవారం కమిటీ ముందు హాజరు కావాలని పీయూ పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్‌డబ్ల్యూ విభాగంలో రెండు, నాలుగు, ఆరవ సెమిస్టర్ పరీక్ష రాసి బుక్ అయిన రెగ్యులర్ విద్యార్థులు, ఐదవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలో మాల్‌ప్రాక్టీస్‌లో బుక్ అయిన విద్యార్థులు బుధవారం పీయూ అకడమిక్ భవనంలో ఉదయం 11:30 గంటలకు వరకు కమిటీ ముందు హాజరుకావాలని రాజ్‌కుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి



మృతి చెందిన కార్మికుడు బత్తరి ఆంజనేయులు

కొత్తకోట, జూలై 2 : భవన నిర్మాణం చేస్తున్న కార్మికుడు పైనుంచి కిందపడి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. సంకిరెడిపల్లి గ్రామానికి చెందిన బత్తరి ఆంజనేయులు(55) కొత్తకోటలో వనపర్తికి చెందిన సురేష్ ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడు. సిమెంట్ ప్లాస్టర్ పనులు చేస్తు కింద పడ్డాడు. తోటి కార్మికులు పైనుంచి వచ్చి ఆసుపత్రికి తరలించేలోపు అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకొని వచ్చిన కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఫిర్యాదు రానందున కేసు నమోదు చేయలేదని ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి

అచ్చంపేట టౌన్, జూలై 2 : కుక్కల దాడిలో జింక మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని శివసాయినగర్ కాలనీ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి శివసాయినగర్ కాలనీ సమీపంలోని ఓ వెంచర్‌లో జింక మృతి చెంది కన్పించింది. ఉదయం వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తులు జింక కళేబరాన్ని గుర్తించి ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అటవీ శాఖ అధికారి రాజేందర్ పరిశీలించి, కుక్కల దాడిలో జింక మృతి చెందినట్లు తెలిపారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

మిడ్జిల్, జూలై 2 : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలో ఉరి వేసుకొని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్సై బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అలివేల(48) మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. చుట్టు పక్కల వారు గమనించి భర్తకు సమాచారం అందించారు. స్థానికులు ఉరి తాడును విడిచి చూడగా అప్పటికే అలివేల మృతి చెందింది. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి బంధువులు, కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

వేధిస్తున్నాడని భర్తపై భార్య ఫిర్యాదు

వెల్దండ, జూలై 2 : తనను మూడేళ్లుగా మానసికంగా, శారీరకంగా వేధిస్తూ అదనపు కట్నం తీసుకురావాలని డిమాండ్ చేసిన భర్తపై భార్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం నగారాగడ్డతండాకు చెందిన రాత్లావత్ స్వప్నను ఆమె భర్త శంకర్ వేధిస్తుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో భర్తపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కుమారస్వామి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

గద్వాల క్రైం, జూలై 2 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని రాఘవేంద్రకాలనీకి చెందిన నరసింహ అనే వ్యక్తి గతనెల 28 నుంచి కన్పించడం లేదని భార్య ఎరుకలి పద్మ మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పట్టణ ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. నరసింహ అనే వ్యక్తి భవాని పాత ఇనుప సామాను దుకాణంలో పనిచేసేవాడు. ప్రతీరోజులాగానే గతనెల 28న పనికి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో దుకాణ యజమాని హనుమాన్‌ను ఆరా తీయగా ఇంటికి వెళతున్నానని అదేరోజు తన దగ్గర రూ.900 కూడా తీసుకుని వెళ్లాడన్నారు. అయితే నరసింహ ఆచూకీ కోసం వెతికినా ఎక్కడా కనపడకపోవడంతో మంగళవారం భార్య ఎరుకలి పద్మ ఫిర్యాదు చేయడంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

జడ్చర్ల, జూలై 2 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన ఓ యువతి మంగళవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదంటూ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల ఏఎస్సై నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిన తన కూతురు ఇంటికి రాకపోవడంతో పరిసర ప్రాంతాల్లో ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఏఎస్సై తెలిపారు.

అక్రమంగా విత్తనం వేసిన వ్యక్తిపై కేసు నమోదు

అలంపూర్ చౌరస్తా, జూలై 2 : పొలం యాజమాని అనుమతి లేకుండానే ఓ వ్యక్తి అక్రమంగా వ్యవసాయ పొలంలో విత్తనం వేసిన ఘటనపై కేసు నమోదైనట్లు ఉండవల్లి ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాదులో నివాసముంటున్న రెడ్డిపోగు సులేమోన్ జ్ఞానదినకర్ విజయపార్వతి దంపతులకు ఉండవల్లి శివారులో సుమారు 20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కంచుపాడు గ్రామానికి వెళ్లేదారిలో వీరికి చెందిన భూమిలో అనుమతులు లేకుండా కంచుపాడు గ్రామానికి చెందిన పెద్దవెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఈ పొలం తన బంధువులదని, నేను మాత్రమే సాగు చేస్తానంటూ కందిపంట సాగు చేశాడు. విషయం తెలుసుకున్న పొలం యాజమాని మంగళవారం ఉండవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆయిల్ పామ్ రైతులకు ఊరట

నిర్వహణా నిధులు విడుదల

గద్వాల, జూలై 2 : ఆయిల్ పామ్ రైతులకు నిర్వహణా నిధులను ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసింది. ఆయిల్ పామ్ సాగు చేసిన రైతులను ప్రోత్సహించేందుకు మొక్కలు నాటిన నుంచి నాలుగేళ్ల పాటు నిర్వహణతో పాటు అంతర్‌పంటల సాగుకు నిధులను విడుదల చేస్తామని ప్రకటించింది. తొలి విడుత మాత్రమే ప్రోత్సాహకం అందించింది. ఆ తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారిపోవడంతో నిధులు విడుదల కాలేదు. ఆ ప్రభావం గత ఏడాది లక్ష్యంపై పడింది. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆయిల్‌పామ్‌ను ప్రోత్సహించాలని భావించి, నిధులను విడుదల చేసింది.

రూ. 1.17కోట్ల విడుదల

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేసిన రైతులకు 2022-23 ఏడాదికి సంబంధించిన రూ. 1.17 కోట్ల నిర్వహణా నిధులు విడుదలయ్యాయి. ఈ ఏడాది 2,862 ఎకరాల్లో 74 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేశారు. అయితే ఇప్పటి వరకు 521 మంది రైతుల ఖాతాల్లో పీఎంఎఫ్ ద్వారా రూ.93.08 లక్షలను నేరుగా జమ చేశారు. ఇంకా 183 మంది రైతులకు రూ. 24 లక్షల వరకు జమ కావాల్సి ఉన్నది. అలాగే 2021-22 ఏడాదిలో సాగు చేసిన రైతులకు కూడా నిధులు విడుదల కావాల్సి ఉంది.



ఆయిల్ పామ్ తోట

నిధులు వస్తున్నాయి



ఆయిల్ పామ్ రైతులకు నిర్వహణా నిధులతో పాటు అంతర్‌పంటల సాగు నిధులు విడుదల అవుతున్నాయి. 2022-23కి సంబంధించిన నిధులు రావడంతో, రైతుల ఖాతాల్లో జమ చేశాం. 2021-22, 2023-24 నిధులు కూడా విడుదల కావాల్సి ఉంది. అవి కూడా త్వరలో రైతుల ఖాతాల్లో జమవుతాయి.

- అక్బర్ అలీ,
జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, గద్వాల

5,770 ఎకరాల్లో తోటలు

జోగులాంబ గద్వాల జిల్లాలో ఈ నాలుగేళ్లలో 5,770 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేశారు. 2020-21లో పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో 250 ఎకరాలలో సాగు చేశారు. ఆ తర్వాత జిల్లాకు టార్గెట్ విధించగా, 2021-22లో 1,479 ఎకరాలు, 2022-23లో 2,857 ఎకరాలు, 2023-24లో 1,183 ఎకరాలలో సాగు చేశారు. ఇలా జిల్లాలో 1,455 మంది రైతులు 5,770 ఎకరాల్లో సాగు చేశారు. 2024-25కు మొదటి విడుతలో 1,500 ఎకరాల్లో సాగు చేయించాలని లక్ష్యం నిర్ధేశించారు.

రేపట్నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

- పాల్గొననున్న తెలంగాణ ఉమ్మడి జిల్లా క్రీడాకారులు
- నేడు క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 2 : మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈనెల 6వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి అండర్-19 బాల, బాలికల బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్(ఎండీబీఏ) అధ్యక్షుడు ఎస్.శ్యామ్‌సుందర్‌గౌడ్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎండీబీఏ సెక్రటరీ ఎల్.రవికుమార్ మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఉమ్మడి తెలంగాణలోని పది జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు, 15 మంది అఫిషియల్స్ టోర్నీకి హాజరు కానున్నారు. బుధవారం క్వాలిఫైయింగ్ రౌండ్, గురువారం నుంచి శనివారం వరకు డబుల్స్, సింగిల్స్, మిక్స్‌డ్ విభాగాల్లో మెయిన్ డ్రా పోటీలు జరగనున్నాయి. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నారు.

నాలుగో తేదీన పోటీలను ప్రారంభించనున్న ప్రజాప్రతినిధులు

ఈనెల నాలుగో తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో టోర్నీని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే.అరుణ, రాష్ట్ర క్రీడా వ్యవహారాల శాఖ సలహాదారుడు ఏపీ.జితేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై టోర్నీని ప్రారంభించనున్నారు.



టోర్నీ కోసం ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలిస్తున్న దృశ్యం

టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తాం..



మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో గురువారం నుంచి శనివారం వరకు రాష్ట్ర స్థాయి అండర్-19 బాల, బాలికల బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహిస్తున్నాం. ఉమ్మడి తెలంగాణ రాష్ట్రంలోని పది జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. అందరి సహకారంతో టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తాం.

- ఎస్.శ్యామ్‌సుందర్‌గౌడ్,
మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్(ఎండీబీఏ) అధ్యక్షుడు

కళాశాలలో 'అమ్మకు ప్రేమతో ఒక మొక్క'

- ప్రధాని పిలుపు మేరకు మొక్కలు నాటిన విద్యార్థులు

జడ్చర్ల, జూలై 2 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చిన 'అమ్మకు ప్రేమతో ఒక మొక్క' కార్యక్రమాన్ని మంగళవారం జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అప్పియచిన్నమ్మ మాట్లాడుతూ మన్‌కీ బాత్ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ అంశంపై ప్రధాని మాట్లాడుతూ అమ్మకు ప్రేమతో ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారని తెలిపారు. అందులో భాగంగానే బొటానికల్ గార్డెన్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో 50 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మొక్కలను నాటారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, బొటానికల్ గార్డెన్ కోఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య, అధ్యాపకులు లత, వెంకటేశ్వర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

భారీగా నల్లబెల్లం పట్టివేత

- 660 కిలోల బెల్లం స్వాధీనం
- ఒకరిపై కేసు నమోదు

లింగాల, జూలై 2 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లింగాల మండలం రాయవరం గ్రామంలో పంట పొలాల్లో తయారు చేస్తున్న నాటుసారా బట్టీలను ధ్వంసం చేయడంతో పాటు బెల్లాన్ని పట్టుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వ్యవసాయ పొలాల్లో నాటుసారా తయారీకి అవసరమైన బెల్లాన్ని నిల్వ చేశారనే సమాచారం అందుకున్న తెలకపల్లి ఎక్సైజ్ సీఐ రమణయ్య తన సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించడంతో 22 బ్యాగుల బెల్లం లభించింది. బెల్లంతో పాటు 30 కేజీల ఆలం కూడా పట్టుబడింది. 22 సంచుల్లో 660 కిలోల బెల్లంతో పాటు పది లీటర్ల సారాను పట్టుకున్నారు. సారా తయారీ చేయడానికి తయారు చేసిన వంద లీటర్ల బెల్లం పానకాన్ని నేలపాలు చేశారు. సారా తయారీ కోసం బెల్లాన్ని తీసుకొచ్చిన శ్రీనుపై, బెల్లం అమ్మకాలు జరిపిన వ్యాపారి బిజినేపల్లి భాస్కర్‌శెట్టిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ బెల్లం, ఆలం విలువ రూ.50 వేలు ఉంటుందని సీఐ తెలిపారు. దాడిలో ఎక్సైజ్ ఎస్సై జనార్దన్, సిబ్బంది గోపాల్‌రెడ్డి, నాగార్జున, కృష్ణా, మాజాయిద్‌లు పాల్గొన్నారు. బెల్లం పట్టుకున్న ఎక్సైజ్ సిబ్బందిని నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి ఏఈఎస్ సుధాకర్‌లు అభినందించారు.



పట్టుకున్న బెల్లంతో ఎక్సైజ్ శాఖ సిబ్బంది

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



చెంచు కుటుంబాలను పరామర్శిస్తున్న ఐక్య వేదిక నాయకులు

కొల్లాపూర్, జూలై 2 : కొల్లాపూర్ మండల పరిధిలోని మొలచింతలపల్లిలో చెంచు మహిళపై జరిగిన పాశవిక దాడిపై, నాగన్న మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, బాధిత కుటుంబానికి రూ. 25లక్షల పరిహారం ఇవ్వాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూడావత్ ధర్మనాయక్ డిమాండ్ చేశారు. కొల్లాపూర్ మండలం కేఎల్ఐ గెస్ట్‌హౌస్‌లో డీవైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి బి.శివవర్మ అధ్యక్షతన ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మూడావత్ ధర్మనాయక్ హాజరై మొలచింతలపల్లి చెంచు మహిళ, నాగన్న మృతిపై జరిగిన దాడి దౌర్జన్యాలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక బృందం చెంచు పెంటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంచులపై జరిగిన అఘాయిత్యాలను చూస్తుంటే సభ్య సమాజం తలదించుకునే విధంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. దాడికి సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా చెంచులకు విద్యవైద్యం సరైన గుర్తింపు కార్డులు జారీ చేసి ఒక్కొక్క కుటుంబానికి మూడెకరాల సాగు భూమిని కేటాయించి వారికి అండగా ప్రభుత్వం ఉండాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.నరసింహ, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మూడావత్ శంకర్‌నాయక్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.బాలపీరు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.దశరథం, ఆవాజ్ సంఘం జిల్లా కన్వీనర్ ఎండి.సలీం, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు జల్లాపురం సురేందర్, బంకల సతీష్, కిరణ్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని రాజు, జిల్లా నాయకులు సంజీవ్, కార్తీక్, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు తరుణ్, ఏ.శివకుమార్ తదతరులు పాల్గొన్నారు.

సమస్యల నిలయంగా గిరిజన బాలుర వసతి గృహం

లింగాల : ప్రభుత్వ గిరిజన బాలుర హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధర్మనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని మంగళవారం గిరిజన సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

కోలుకుంటున్న గొడుగు భాస్కర్

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 2 : మిద్దె కూలి భార్య, ముగ్గురు పిల్లలు మృతి చెందగా తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గొడుగు భాస్కర్ నెమ్మదిగా కోలుకుంటున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ రఘు మంగళవారం తెలిపారు. అతడు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతున్నట్లు తెలిపారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడిన తర్వాత డిశ్చార్జ్ చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. మిద్దె కూలి నలుగురు మృతి చెందడంతో వనపట్ల గ్రామంలో విషాదం నుంచి గ్రామస్థులు కోలుకోలేదు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

కల్వకుర్తి టౌన్, జూలై 2 : ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని శ్రీపురం గ్రామానికి చెందిన సాయిదీపక్‌చారి, నవీన్‌చారిలు దగ్గరి బంధువులు. మంగళవారం వీరిద్దరూ శ్రీపురం నుంచి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యలో తాడూర్ మండలం గుంతకోడూర్ గ్రామంలో ఓ విందుకు హాజరయ్యారు. అక్కడ్నుంచి కల్వకుర్తి మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుండగా కల్వకుర్తిలోని సిల్వర్‌జూబ్లీ క్లబ్ వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే డివైడర్‌పైన ఉన్న ఇనుపచువ్వలను బలంగా ఢీకొన్నారు. ప్రమాదంలో సాయిదీపక్‌చారి తలకు తీవ్ర గాయం కాగా, నవీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కుక్కను తప్పించబోయి యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన సిద్ధార్థ

బిజినేపల్లి, జూలై 2 : అకస్మాత్తుగా ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించబోయి బైక్ అదుపు తప్పి కిందపడిన ప్రమాదంలో గోవిందు సిద్ధార్థ(18) అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం గ్రామానికి సిద్ధార్థ మంగళవారం బైక్‌పై పాలెం నుంచి నాగర్‌కర్నూల్‌కు వెళ్తున్నాడు. కొట్టాల్‌గడ్డ బస్టాండ్ సమీపంలో ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించబోయి బైక్ అదుపు తప్పి రోడ్డుపై కిందపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన యువకుడిని స్థానికులు గమనించి 108కు సమాచారం ఇచ్చి నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు బంధువులు తెలిపారు.

కారు నడుపుతూ ఉద్యోగికి..

నవాబ్‌పేట, జూలై 2 : సెల్‌ఫోన్ మాట్లాడుతు కారు నడపడంతో కారు రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకుపోయి ప్రభుత్వ ఉద్యోగి గాయపడిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కాకర్లపాడు గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మెండె మల్లేష్ వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మరికల్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పనులు ముగించుకొని సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ కారును నడుపుతున్నాడు. నవాబ్‌పేట వైపు వస్తుండగా కాకర్లపాడు గ్రామ సమీపంలో తాను నడుపుతున్న కారు అదుపు తప్పి పక్కన ఉన్న గుంతలోకి దూసుకుపోయింది. దీంతో మల్లేష్‌కు కాలు విరగడంతో పాటు, శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం అతన్ని జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



చిన్నతాండ్రపాడు రహదారిలో బోల్తా పడిన ఆటో

అయిజ, జూలై 2 : అదుపు తప్పి ఆటో బోల్తా పడిన ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం చిన్నతాండ్రపాడు గ్రామానికి చెందిన సతీష్ మంగళవారం సాయంత్రం తన ఆటోలో బంధువులను అయిజలో దించి గ్రామానికి తిరుగుప్రయాణమయ్యాడు. అయిజ - చిన్నతాండ్రపాడు గ్రామం మధ్యన బీటీ రహదారిపై లోతుగా ఏర్పడిన గోతులను తప్పించకు వెళ్తుండగా ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ సతీష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

జాతీయ రహదారిపై కారు బోల్తా

- ముగ్గురికి గాయాలు

అలంపూర్ చౌరస్తా, జూలై 2 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం, తాడిపత్రి గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు కారులో తిరుమల దర్శనానికి వెళ్లి వస్తూ ఉండవల్లి గ్రామ శివారులో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ఉన్న భానుకిరణ్, సురేష్, వెంకట్రాముడు, చిన్నారి రబీతలకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

పెట్రోల్ పంపులో పనిచేసే వారిపై దాడి

జడ్చర్ల, జూలై 2 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నుంచి గంగాపురం వెళ్లే దారిలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపులో పనిచేస్తున్న మల్లేష్, సురేశ్, అరుణ్, రాజులపై పట్టణంలోని నల్లకుంటకు చెందిన శ్రీకాంత్, ఇందిరానగర్ కాలనీకి చెందిన బద్రిలు దాడికి పాల్పడ్డారని పంపు యజమాని పోల ఆదిత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల ఎస్సై శివానంద్ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో పెట్రోల్ పోయాలంటూ వచ్చారని, గదిలో ఉన్నవారు వచ్చేలోపు, గది తలుపులు పగులగొట్టి, పనిచేస్తున్న వారిపై దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రేపు విద్యా సంస్థల బంద్‌కు పిలుపు

గండీడ్, జూలై 2 : ఎన్‌టీఏ రద్దు చేయాలని ఈనెల 4వ తేదీన విద్యాసంస్థల బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించాలని ఎస్ఎఫ్ఐ ఉమ్మడి మండల కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ పరీక్షలో అవకతవకలు, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు అరికట్టేందుకు నిరసనగా ఉమ్మడి మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల బంద్‌కు సహకరించాలని కోరారు. ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజులు అధికంగా పెరగడంతో నిరుపేదల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

ఎంపీపీని పరామర్శించిన ఎమ్మెల్యే జీఎంఆర్



వెంకట్‌రాంరెడ్డి చిత్రపటం ముందు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

అడ్డాకుల, జూలై 2 : స్థానిక ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి తండ్రి దోనూరు వెంకట్‌రాంరెడ్డి ఇటీవల మరణిచండంతో మంగళవారం పొన్నకల్ గ్రామంలో దశదినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పాల్గొని దోనూరు వెంకట్‌రాంరెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో అడ్డాకుల, మూసాపేట మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బర్హానే బాదేషా దర్గా గంధోత్సవం



గంధోత్సవం నిర్వహిస్తున్న ముస్లింలు

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 2 : జిల్లా కేంద్రంలోని ఎర్రకుంట సమీపంలోని గల హజ్రత్ బర్హానే బాదేషా రహమతుల్లా అలై దర్గా ఉర్సే షరీఫ్ వేడుకలు ప్రారంభమయ్యాయి. మంగళవారం మక్కా మసీదులోని అబ్దుల్‌కరీమ్‌సాబ్ ఇంటి నుంచి క్లాక్‌టవర్, పాన్ చౌరస్తా, లైబ్రరీ మీదుగా దర్గాకు గంధోత్సవం నిర్వహించారు. అనంతరం చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి 10 గంటలకు ఖవ్వాలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా ముతవల్లి గయాజ్‌పాషా, మతపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు

- సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

కోయిలకొండ, జూలై 2 : వానాకాలం పంటల సాగు కోసం రైతులకు అందుబాటులో వరి విత్తనాలు గార్లపాడ్‌లోని సింగిల్‌విండో కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయని సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం గార్లపాడ్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన సింగిల్‌విండో సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగిల్ విండోలో కే.ఎస్.ఎమ్, 10,10, జెజిల్ రకాల వరి విత్తనాలు ఉన్నాయని తెలిపారు. రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని సూచించారు. త్వరలో నూతనంగా నిర్మించిన సింగిల్‌విండో కార్యాలయాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకవస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రామ్‌పాల్, సింగిల్‌విండో డైరెక్టర్లు శ్రీపాదరావు, ఆశన్నగౌడ్, కృష్ణారెడ్డి, గోపాల్ నాయక్, కృష్ణారెడ్డి, సీఈవో శ్రీరామ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు భరోసా పథకం అందరికీ అందించాలి

హన్వాడ, జూలై 2 : పది ఎకరాల లోపు భూమి ఉన్న ప్రతి రైతుకు రైతుబరోసా ఇవ్వాలని రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. మంగళవారం హన్వాడలో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా పథకం అమలుపై సూచనలు, సలహాల కోసం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు రైతులు మాట్లాడారు. పది ఎకరాల వరకు అని కందరు, 20 ఎకరాల వరకు ఉన్న రైతులకు ఇవ్వాలని కొందరు రైతులు కోరారు. ఇంకొందరు ఉద్యోగం ఉన్నా ఈ పథకాన్ని అందిస్తే పంటలు పండిస్తారని సలహా ఇచ్చారు. తహసీల్దార్ కిష్యానాయక్, ఏవో కిరణ్‌లు రైతులనుంచి అభిప్రాయాలు స్వీకరించారు. సొసైటీ చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్ బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు కొండ లక్ష్మయ్య, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు పెద్దచెన్నయ్య డైరెక్టర్లు ఎస్.శ్రీనివాసులు, తిర్మల్‌రెడ్డి, చెన్నయ్య, రాజు, కేశవరెడ్డి, రైతులు సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

అడ్డాకుల, జూలై 2 : మండల పరిధిలోని బలీద్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు, పారిశుధ్య కార్మికుడు గుడిసె చిన్న బుచ్చన్న కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ సోమ వారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సానుభూతి తెలుపుతూ రూ. ఐదువేలు సమకూర్చారు. ఆ డబ్బులను స్థానిక కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా గ్రామంలో 25మంది యువకులు ఏర్పాటు చేసుకున్న బీపీఎల్ ఫౌండేషన్ ద్వారా రూ. ఐదువేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో వెంకటిరెడ్డి, ప్రవీణ్ కుమార్, మొగులయ్య, దేవరాజ్, మన్నెం, కురు మూర్తి, శ్రీనివాసులు, ఆంజనేయులు, వెంకట్, శివ, యాదయ్యసాగర్, ఎంపీటీసీ గణేశ్, మాజీ సర్పంచు పద్మనరసంహ, శ్రీధర్, కురుమూర్తి, బాలకృష్ణ, అంజనేయులు ఉన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేసిన ఫౌండేషన్ సభ్యులు

జడ్చర్ల, జూలై 2 : జడ్చర్ల మండలం గంగాపురం జడ్పీహెచ్‌ఎస్‌లోని విద్యార్థులకు మంగళవారం నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. రేపటి మంచి కోసం మార్పు అనే నినాదంతో స్నేహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి అన్నారు. నూతనంగా పాఠశాలలో చేరిన 50 మంది విద్యార్థులకు బ్యాగులను, పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనంతప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లస్వామి, రవి, మధుసూదన్‌రెడ్డి, జరీనాబేగం, జ్యోతి, తిరుపతిరెడ్డి, షర్మిల పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజీ పనులు షురూ



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కోయిలకొండ, జూలై 2 : మండలంలోని కేశవాపూర్ గ్రామంలో రూ.2 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు శ్రీధర్ కిశోర్ తెలిపారు. మంగళవారం కేశవాపూర్‌లో పనులు ప్రారంభించి మాట్లాడారు. గ్రామాభివృద్ధికి ప్రతీ ఒక్కరు తోడ్పాటు అందించాలని కోరారు. అండర్ డ్రైనేజీతో గ్రామంలో మురుగునీరు రోడ్డుపై వెళ్లకుండా పరిసరాలు శుభ్రంగా ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మొగులయ్య, నాయకులు రాజేందర్‌రెడ్డి రేడ్యానాయక్ పాల్గొన్నారు.

బూర్గుపల్లి గ్రామ పంచాయతీకి బీసీ జనరల్ రిజర్వేషన్ కేటాయించాలి

జడ్చర్ల, జూలై 2 : జడ్చర్ల మండలం బూర్గుపల్లి గ్రామపంచాయతీకి బీసీ జనరల్ రిజర్వేషన్ కేటాయించాలంటూ బూర్గుపల్లి గ్రామానికి చెందిన కొందరు యువకులు, బీసీ సేన నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ ఎన్నికలలో ఇప్పటి వరకు బీసీ జనరల్ రిజర్వేషన్ రాలేదని, వచ్చే ఎన్నికలలో బీసీ జనరల్ రిజర్వేషన్‌ను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నర్సిములు, కన్నయ్య, కురుమూర్తి, రాములు, రాజు, వినోద్ ఉన్నారు.

బీవీపీ ద్వారా పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 2 : భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వెంకటేశ్వర కాలనీ(పిల్లలమర్రిరోడ్డు) విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిల్స్, రబ్బర్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు దాతల సహకారంతో పుస్తకాలు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దాతలు యస్.ఆర్ కిషోర్, డాక్టర్ ఎస్.కె.దిలీప్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీవీపీ అధ్యక్షుడు ఎస్.భూషణ్ పాండే, జి. పాండురంగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెట్లు లేనిదే మానవ మనుగడ లేదు

- మన్యంకొండలో మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్

మహబూబ్‌నగర్ రూరల్, జూలై 2 : చెట్లు లేనిదే మానవ మనుగడ లేదని, మానవ జీవితంలో అతి ముఖ్యమైనవి వృక్షాలే అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని మన్యంకొండ అలివేలుమంగ అమ్మవారి దేవస్థానం ఆవరణలో కలెక్టర్ విజయేందిర బోయి, జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. జిల్లాలో గతంలో లాగా రికార్డుల కోసం కాకుండా నాటిన ప్రతీ మొక్క బతికేలా కాపాడాలని అన్నారు. ప్రతీ ఒక్కరు పది మొక్క లు నాటేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు, జడ్పీ సీఈవో రాఘవేంద్రరావు, డీఆర్‌డీవో పీడీ నర్సింహులు, డీఎఫ్‌వో సత్యనారాయణ, ఆర్‌డీవో నవీన్, డీపీఆర్‌వో శ్రీనివాసులు, తహసీల్దార్ సుంద ర్‌రాజ్, ఇన్‌చార్జి ఎంపీడీవో నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, అధికారులు, కాంగ్రెస్ మండల, గ్రామాల నాయకు లు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే యెన్నం, కలెక్టర్ విజయేందిర, జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణమ్మ

ఫారెస్టుబీట్ ఆఫీసర్ల నివాస భవనం ప్రారంభం

హన్వాడ : మొక్కలు నాటి అడవులను కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలం లోని పిల్లిగుండుతండా వద్ద నిర్మిం చిన ఫారెస్టు బీట్ ఆఫీసర్ల నివాస భవనాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం చిన్నదర్పల్లి అడవిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అడవుల సంరక్షణకు బీట్ ఆఫీసర్లు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వారి సంక్షేమం కోసం కట్టుబడి ఉంద న్నారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, వాటిని అనుక్షణం రక్షించుకుంటే సమాజం బాగుపడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఎఫ్‌వో సత్యనారాయణ, డీఆర్‌డీ వో పీడీ నర్సింములు, ఎంపీపీ బాలరాజు, ఎంపీ టీసీ సభ్యురాలు మనెమ్మ, నాయకులు, అధికా రులు సుధాకర్‌రెడ్డి, మహేందర్, లింగం నాయక్, కృష్ణయ్య, వెంకటాద్రి పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్

అతిసార నియంత్రణపై అవగాహన కల్పించాలి

- స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జూలై 2 : జిల్లాలో అతిసారపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని రామయ్యబౌళి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున నీరు, పరిసరాలు కలుషితమై డయేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయని, ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లలు ఎక్కువ శాతం సీజనల్ వ్యాధుల బారిన పడతారన్నారు. అందువలన వైద్యాధికారులు డయేరియాపై ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రత్యేకంగా గ్రామాల్లో ప్రజలకు డయేరియా వ్యాపించే విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. డయేరియా మరణాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకునేందుకు ఈ స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 1 నుంచి ఆగస్టు 31 వరకు ఉంటుందని, ఈ రెండు నెలలు ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి డయేరియా లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ఆసుపత్రులకు పంపించాలని, అదేవిధంగా ప్రతి ఇంట్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంచిపెట్టాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్ కార్నర్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణ, డీఐవో డాక్టర్ శంకర్, అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ భాస్కర్‌నాయక్, డాక్టర్ శశికాంత్, డాక్టర్ రఫీక్, డాక్టర్ జరీనా బాను, అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గౌతమి, వార్డు కౌన్సిలర్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.



పర్దీపూర్ గ్రామంలోని బురదలో సైకిళ్లపై వెళుతున్న విద్యార్థులు



గుంతలమయమైన రోడ్డు

గుంతలతో అవస్థలు

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

చిన్నచింతకుంట, జూలై 2 : మండలంలోని పర్దీపూర్ గ్రామానికి చెందిన విద్యార్థినీ, విద్యార్థులు రోడ్లపై ఏర్పడిన గుంతలతో నిత్యం అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామం నుంచి పదుల సంఖ్యలో విద్యార్థినులు ప్రతీరోజు కోటకొండ గ్రామంలోని పాఠశాలకు వచ్చిపోతుంటారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పర్దీపూర్ గ్రామంలోని రహదారిపై భారీగా ఏర్పడ్డ గోతుల్లో నీరు నిండి వాహనాల రాకపోకలతో బురద కుంటలుగా మారాయి. ఇక పాఠశాలకు వెళ్లాలంటే ఈ గోతులను దాటుతూ సైకిల్‌పై వెళ్లాల్సి ఉంటుంది. స్కూల్‌కు వెళ్లేంత వరకు ముఖ్యంగా విద్యార్థినులు ప్రాణాలను అరచేత పట్టుకొని వెళ్తున్నారు. సైకిల్ ఏమాత్రం అదుపు తప్పి గోతిలో పడితే ఇక ఆ రోజు స్కూల్‌కు సెలవు పెట్టాల్సిందే. రహదారిని బాగు చేయాలని విద్యార్థులతో పాటు, గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి

- మండల సమావేశంలో అధికారులకు సూచించిన ఎంపీపీ

- ప్రజాప్రతినిధులకు సన్మానం

మిడ్జిల్, జూలై 2 : మండలంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎంపీపీ బరిగెల సుదర్శన్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బరిగెల సుదర్శన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ తమ శాఖలకు చెందిన ఎజెండాను చదివి వినిపించారు. ఉపాధి హామీ పథకంలో ఇటీవల జరిగిన మండలస్థాయి సామాజిక తనిఖీ సమావేశంలో ఎవరెవరికి ఎంత జరిమాన విధించారో, ఎంతమంది వద్ద రికవరి చేశారు, అవినీతికి పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో సభ్యులకు వివరించాలని ఎంపీటీసీ గౌస్ ప్రశ్నించారు. అధికారులు ఇప్పటికైన్నా అధికారులు నిర్లక్ష్యధోరణి విడనాడి ప్రజలకు సేవలందించాలన్నారు. మిషన్‌భగీరథ నీరు పసుపు కలర్‌లో వస్తున్నాయని వేముల ఎంపీటీసీ యశోధ అధికారులను ప్రశ్నించారు. ఇకపై అలా జరుగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. జడ్పీటీసీ శశిరేఖ, వైస్ ఎంపీపీ తిరుపతమ్మ మాట్లాడారు. చివరి సర్వసభ్య సమావేశం కావడంతో ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీలతో పాటు ఎంపీటీసీ సభ్యులు గౌస్, రాజారెడ్డి, యశోద, నర్సింహలను అధికారులు, పలువురు నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గీతాంజలి, తహసీల్దార్ రాజునాయక్, ఎంపీవో అనురాధతో పాటు పలు శాఖలకు చెందిన ఏఈలు, అధికారులు ఉన్నారు.



ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

నిరుద్యోగ సమస్య పరిష్కరించాలి

ప్రభుత్వం వెంటనే జాబ్‌క్యాలెండర్‌ను విడుదల చేయాలి

- బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి

మిడ్జిల్/ దేవరకద్ర/ గండీడ్/ బాలానగర్/ అడ్డాకుల, జూలై 2 : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ, బీజేవైఎం నాయకులతో కలిసి తిరుపతి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి గత ప్రభుత్వం మాదిరిగానే ఉందని అన్నారు అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పి నేటికీ విడుదల చేయలేదన్నారు. నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వస్తే సరిపోదని, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో ప్రకారం 1:100 ప్రకారం క్యాలిపై చేసి, గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులను అదనంగా పెంచాలన్నారు. మెగా డీఎస్సీని ఏర్పాటు చేయాలని, మహిళా అభ్యర్థులకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 46ను వెంటనే ప్రభుత్వం రద్దు చేసి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రాజు నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బీజేపీ మండల అధ్యక్షుడు లాలు, గిరిజనమోర్చా మండల అధ్యక్షుడు నరేష్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి వాసుదేవ్, నాయకులు ఆంజనేయులు, మల్లేష్ శివ, శ్రీనివాస్, యాదయ్య, చందు నాయక్, సిద్ధు, లక్ష్మీ నాయక్, మల్లేష్ నాయక్, రాము, హరికృష్ణ ఉన్నారు.

● దేవరకద్ర : గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులను పెంచాలని బారతీయ జనతా పార్టీ యువ మోర్చా మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

● గండీడ్ : నిరుద్యోగులకు నిరుద్యోగ భృతితో పాటు ఉద్యోగాల భర్తీ చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, టైగర్ రవీందర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ నాగలక్ష్మికి వినతి పత్రం అందించారు. గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభు నాయక్, కేశవులు, మండల ఉపాధ్యక్షుడు మల్కయ్య కిసాన్ మోర్చా అధ్యక్షుడు వెంకటేష్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి హరిష్ గౌడ్, బాలయ్య, పరిగి కోకన్వీనర్ శంకర్ నాయక్, రాజు , మోహన్ గౌడ్, నరహరి రెడ్డి పాల్గొన్నారు.

● బాలానగర్ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడుకుంటోందని పలువురు బీజేవైఎం నాయకులు ఆరోపించారు. నిరుద్యోగ సమస్యపై మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు సభావత్ కుమార్‌నాయక్, కార్యదర్శి రవీందర్ నాయక్, ప్రధాన కార్యదర్శి భరత్‌సింహాచారి, బీజేపీ జిల్లా నాయకులు సురేష్ నాయక్, మండల ఐటీ సెల్ నాయకులు శ్యాంప్రసాద్, కార్యదర్శి వెంకట్, రఘు, రాజకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, కిషన్ నాయక్, రాము, కిషోర్ యాదవ్, ఆర్య నాయక్, కుమార్ నాయక్, మధు పాల్గొన్నారు.

● అడ్డాకుల : తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ఉద్యోగ నియామకాలలో నిరుద్యోగులు మోసానికి గురవుతున్నారని పేర్కొంటూ మంగళవారం బీజేవైఎం మండల అధ్యక్షుడు చెన్నకేశవ ఆధ్వర్యంలో కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం మందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మిడ్జిల్ తహసీల్దార్ రాజునాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

టీచర్ బదిలీతో కంటతడి పెట్టిన విద్యార్థులు

గండీడ్, జూలై 2 : గండీడ్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అనిత అనే టీచర్ ఆరేళ్ల నుంచి విద్యార్థులకు హిందీ బోధించారు. విద్యార్థులతో స్నేహంతో కలుసుకొని డ్యాన్సులు ఇతర ముఖ్యమైన విషయాలు నేర్పు తూ విద్యార్థులో కలుపుగోలుగా ఉండేది. ఆమె కోయిలకొండ మండలం ఎల్లారెడ్డిపల్లికి రిలీవ్ అవుతున్న వార్త విన్న విద్యార్థులు మీరు వెళ్లొద్దు టీచర్ అంటూ కాళ్ల మీద పడి కంటతడిపెట్టారు. విద్యార్థుల కంటతడితో టీచర్ కూడా కంటతడి పెట్టుకున్నారు. విధుల్లో భాగంగా తప్పదని, మీరంతా శ్రద్ధగా చదువుకోవాలని విద్యార్థులను ఆశీర్వదిం చారు.

బీజేపీ ఆధ్వర్యంలో రేపు స్వాగత బైక్ ర్యాలీ

మహబూబ్‌నగర్ (క్లాక్ టవర్), జూలై 2 : పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గం ఎం.పీ, భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పార్లమెంట్ సమావేశాలు ముగించుకొని రేపు (గురువారం) జిల్లా కేంద్రానికి మొదటి సారిగా రానున్నారు. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అప్పన్నపల్లి నుంచి భగీరథ కాలనీ అన్నపూర్ణ గార్డెన్ వరకు పెద్ద ఎత్తున స్వాగత బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కోయిలకొండ ఎస్‌ఐగా శ్రీకాంత్



ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీకాంత్

కోయిలకొండ, జూలై 2 : కోయిల కొండ ఎస్‌ఐగా శ్రీకాంత్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన రాఘవేందర్ బదిలీ అయ్యారు. కోయికొండ మండలంలో శాంతి భద్రతలు అదుపులో పెట్టేందుకు కృషి చేస్తాన ని నూతన ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల వారీగా సమాచారాన్ని పోలీస్ సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు.

'పెండింగ్ జీతాలు ఇవ్వాలి'

హన్వాడ, జూలై 2 : గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హన్వాడలో కార్మికులు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 35 గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న కార్మికులకు ఒకొక్కరికి 8 నెలల జీతాలు రావాలసి ఉందన్నారు. ఎన్నో ఇబ్బందులతో పని చేస్తున్నామని, ప్రభుత్వం కరుణించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ మండల అధ్యక్షుడు బాలకిష్టయ్య, జిల్లా నాయకుడు వెంకట్రాములు, తిమ్మన్న, చెన్నయ్య, భీమయ్య, గంగాపూరి, నాగరాజు, నరేష్ పాల్గొన్నారు.

ప్రజాపాలనకు 1200 దరఖాస్తులు

దేవరకద్ర, జూలై 2 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలనకు 1200 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జీరో కరెంటు బిల్లు, 500 గ్యాస్ సిలిండరు రాని వారు ఉంటే తమ దరఖాస్తులను, ప్రజాపాలన దరఖాస్తులను తీసుకొచ్చి ఎంపీడీవో కార్యలయం దగ్గర ఏర్పాటు చేసిన కౌంటర్లలో ఇవ్వాలని తెలిపారు.

'నేటి ముట్టడిని జయప్రదం చేయాలి'

జడ్చర్ల, జూలై 2 : ఈ నెల 3న తలపెట్టిన తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి కార్మికులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పెండింగ్ వేతనాలు చెల్లింపులు, జాతీయ పండుగ ఆర్జిత సెలవులు అమలు తదితర డిమాండ్‌లతో వైద్యవిధాన పరిషత్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడ్తున్నట్లు పేర్కొన్నారు.నోటీసును ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సోమశేఖర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవానంద్, విజయలక్ష్మీ, సుక్కమ్మ, యాదమ్మ, చెన్నమ్మ, పద్మ, కవిత, అలివేలు, భార్గవి, లక్ష్మమ్మ, శేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.